క్లుప్తంగా

21న ప్రవేశ పరీక్ష

ఉయ్యాలవాడ : ఈ నెల 21వ తేదీన స్థానిక మోడల్‌స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంద సీట్లు ఖాళీగా ఉండగా 125 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు,ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని చెప్పారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



పట్టాభిషేకం అనంతరం స్వామి వారికి హారతులు ఇస్తున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో బుధవారం నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వేడుకగా జరిపించారు. కాగా గురువారం స్వామి వారికి అత్యంత వైభవంగా పట్టాభిషేకం నిర్వహించారు. మొదటగా మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టి పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా వేదమంత్రాల సాక్షిగా పట్టాభిషేకం జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి కోరారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప ఎస్టీ జాబితాలో చేర్చిన దాఖలాలు లేవన్నారు. పట్టణంలోని విశ్వనగర్‌లో గురువారం జరిగిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి రాము, ఆంజనేయులు, రమేష్, నాగశేషు, రాజు, నరసింహులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తెకు మానసిక స్థితి సరిగాలేదు. బుధవారం ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున వివరించారు.

నంద్యాల అసెంబ్లీకి మూడు నామినేషన్ల దాఖలు

నంద్యాల(అర్బన్): నంద్యాల అసెంబ్లీ స్థానానికి గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను ఎస్‌డీపీఐ అభ్యర్థితో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు అందజేశారు. వారిలో విష్ణువర్ధన్‌రెడ్డి(స్వతంత్ర), శ్రావణ్‌కుమార్ (స్వతంత్ర), షేక్‌మహమ్మద్ ఫాజిల్(ఎస్‌డీపీఐ) తరఫున నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

నిందితుల అరెస్టు

మహానంది: మండలంలోని శ్రీనగరం గ్రామానికి చెందిన సుబ్బయ్య, బంధుమిత్రులు బుధవారం రాత్రి తిరుపతి వెళ్తుండగా తమ్మడపల్లె దుర్గమ్మ గుడి వద్ద గాలిపడతామని కారును ఆపి బెదిరించిన ఘటనలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమ్మడపల్లె, బుక్కాపురం, బొల్లవరం గ్రామాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా మద్యం మత్తులో ఈ పనికి ఒడిగట్టారని ప్రాథమికంగా తేలింది.

జనసేన నేతపై కోడ్ ఉల్లంఘన కేసు

మహానంది: గిద్దలూరుకు చెందిన జనసేన నేత పగడాల శశిధర్ ఎలాంటి అనుమతి లేకుండా కారులో కరపత్రాలను తీసుకెళ్తుండగా పోలీసులు కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గిద్దలూరు నుంచి నంద్యాలకు వస్తున్న శశిధర్ కారులో పవన్ కల్యాణ్‌గారి మనోగతం పేరుతో ఉన్న రెండు వందల కరపత్రాలను తీసుకొస్తున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా గుర్తించి, అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యుత్ తీగలు తగిలి వరి గడ్డి లారీకి మంటలు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు నుంచి గురువారం రాత్రి అనంతపురం జిల్లా నార్పలకు లారీలో వరిగడ్డిని తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి నిప్పంటుకుంది. లారీని ఊరిబయటికి తీసుకెళ్లే క్రమంలో కట్టలు పడటంతో వెనుక ఉన్న ఓ బైక్ కాలిపోయింది. అలాగే బైక్‌పై వెళ్తున్న కొత్తపల్లెకు చెందిన ఉశేని, కుమార్తె రజియాకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

చాబోలు.. అభివృద్ధి భళా

- ప్రగతి పట్టాలెక్కిన గ్రామం
- గ్రామస్తులకు రూ.30.81కోట్ల సంక్షేమాభివృద్ధి లబ్ధి
- రూ.3.75 కోట్లతో అభివృద్ధి పనులు
- నాడు–నేడుతో పాఠశాలలకు కొత్త రూపు



సేవలందిస్తున్న గ్రామ సచివాలయం



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు



నంద్యాల(అర్బన్): పేదరికం రూపుమాపుతామని కొన్ని దశాబ్దాలుగా ఏలిన పాలకులు హామీలిచ్చారే కానీ వాటిని ఆచరణ లో చూపించలేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు కూడు, గుడ్డ, ఇళ్లు కల్పించకపోవడంతో వారు మరింత పేదలుగా జీవనం సాగించేవారు. సంక్షేమ పథకాల కోసం ఎక్కని మెట్టు, దిగని మెట్టు లేదు. రాజకీయం కోణంలో పథకాలు అందజేస్తుండటంతో తమ బతుకులింతేనని నిట్టూర్చేవారు. ఐదేళ్ల క్రితం వరకు గ్రామంలో పథకాలు పొందేవారి సంఖ్యను వేళ్లపై ఉండేది. ఇక అభివృద్ధి మాట దేవుడెరుగు. కనీస వసతులకు నోచుకోక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. పరిస్థితులు, పాలన విధానం మారిపోయింది. పేదలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు కేవలం అర్హత ఆధారంగ పథకాలు వర్తింపజేశారు. కోట్లాది రూపాయలతో సౌకర్యాల కల్పనతో పాటు వారి అభ్యున్నతికి వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టింది. మండలంలోని చాబోలు గ్రామంలో అభివృద్ధిలో మండలంలోని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. 7,150 మంది జనాభా, 4,393 మంది ఓటర్లున్న గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో రూ.22.47 కోట్లు వివిధ పథకాల కింద లబ్ధిదారులకు అందజేశారు. రూ.3.75 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామంలో కొత్తగా సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలను నిర్మించారు. రూ.40లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనం ద్వారా గ్రామ పాలన సాగుతోంది. రూ. 1.30కోట్లు వెచ్చించి పాఠశాలలను రూపదిద్దారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తవడంతో కార్పొరేట్ పాఠశాలలను తలపిస్తున్నాయి.

అభివృద్ధి ఇలా...

గ్రామంలో సుమారు రూ. 40లక్షల వ్యయంతో సచివాలయం నిర్మించారు. ఆర్‌బీకే నిర్మాణ దశలో ఉంది. ఎంపీ, గడప గడపకు మన ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించారు. 185 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు అందించాని సంకల్పించగా కొందరు కోర్టుకు వెళ్లడంతో స్థలాల పంపిణీ నిలిచిపోయింది.



మురుగు కాల్వ పనులు జరుగుతున్న దృశ్యం

వివిధ సంక్షేమ పథకాలు ద్వారా స్థానికులు రూ.22.47కోట్ల మేర లబ్ధి జరిగింది. ఇక పరోక్ష విధానంలో రూ.8.34కోట్లు లబ్ధి చేకూరింది. మొత్తం రూ.30.81 కోట్లు ప్రయోజనం చేకూరింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాలు అభివృద్ధి చెందాయి. వలంటీర్, సచివాలయాల వ్యవస్థల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా మందికి పథకాలు అందాయి. పనులు కూడా చాలా చేశారు. పథకాలు అందడంతో మా జీవనం మారింది. –హుసేన్‌బాషా, చాబోలు

జగనన్న మేలును మరవలేం



సీఎం జగనన్న చేసిన మేలు మరువలేం.. నాకు వృద్ధాప్య పింఛన్, రైతు భరోసా అందుతోంది. కోవిడ్ సమయంలో ప్రభుత్వం చేసిన సాయం మరువరానిది. చనిపోతామనుకున్న సమయంలో ప్రభుత్వం అన్ని రకాలుగా సాయం అందించి ఆదుకుంది. – ఏసయ్య చాబోలు

మళ్లీ జగనే రావాలి



అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు ఇవ్వడం ఇంతకు ముందు లేదు. పల్లెల్లో వసతులుండేవి కాదు. దీంతో ఇబ్బందులతో నెట్టుకొచ్చాం. ఇప్పుడు చాలా వసతులు కల్పించారు. ఇలా పనులు చేస్తే ఎవరైనా ఆదరిస్తారు. ప్రతి దానికి రాజకీయం చేయరాదు. గతంలో నాయకులే పథకాలు వచ్చేది లేనిది చెప్పేవారు. ఇప్పుడు అధికారులు పరిస్థితిని గమనించి ఇస్తున్నారు. మంచి చేసిన వారు అధికారంలో ఉంటే ప్రజలకు మేలు జరుగుతుంది. కాబట్టి జగనన్నే రావాలి. – చిన్నబాలిరెడ్డి, చాబోలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

రుద్రవరం: మండలంలోని చిలుకలూరు గ్రామంలోలో టీడీపీ వర్గీయులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కుళాయిరెడ్డి, చిన్న కుళాయిరెడ్డితో పాటు అవుకు రాంపుల్లన్న,కుక్కలన్న, చాకలి లింగమయ్య,సంజన్న,తోకల నరసింహుడు(డ్రైవర్), జమాల్‌వలి, చిన్న జమాల్, శాంషవలి, షేక్‌షావలి, మహమ్మద్, బోయ బాలుడు, నారాయణ, గొల్ల నాగరాజు, ఈడిగ రామసుబ్బయ్య, కంచర్ల పుల్లయ్య,రంగ, శీల్‌బాష మరో 30 కుటుంబాల వారికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టామ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. సర్పంచు ప్రసాదరెడ్డి, నాయకులు మహేశ్వర రెడ్డి, రామచంద్రారెడ్డి, టైలర్ ఉశేన్‌సా, మాజీ సర్పంచు నరసింహ, గోపవరం నరసింహారెడ్డి, పార్థసారధి రెడ్డి, చాకలి సుబ్బరాయుడు ఉన్నారు.

మొదటి రోజు నామినేషన్లు నిల్



నామినేషన్ కార్యాలయంలో అధికారులు

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 25 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాగా నోటిఫికేషన్ వెలువడి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తొలి రోజు ఆళ్లగడ్డ నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఆర్వో తెలిపారు. ఎన్నికల నిర్వహణ అంశాలను ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక కార్యాలయం నోటీస్ బోర్డుల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అభ్యర్థులు సంబంధిత అధికారులతో తగిన సలహాలు, సూచనలు తీసుకోవచ్చన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి



కే.కొత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గంగుల సారికారెడ్డి

రుద్రవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి సతీమణి గంగులసారికా రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కే.కొత్తూరు,కోటకొండ గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, సర్పంచు దేగాని వెంకటేష్, నాయకులు రామకృష్ణ, సంజీవకర్ణ, అంకన్న, స్వామిదాస్, శివుడు,శివ మల్లికార్జునరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షేమ పాలనకు ఓటెయ్యండి



పార్టీలో చేరిన వారితో అవంతికారెడ్డి

దొర్నిపాడు: గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోదరి అవంతికారెడ్డి కోరారు. గురువారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నీ సామాజిక వర్గాలకు న్యాయం చేసిందన్నారు. మంచి చేసిన జగనన్నను మరోసారి సీఎం చేసుకుంటే ఇంతకు మించి సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేసుకుందామన్నారు. సర్పంచ్ శివరామిరెడ్డి, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, నాయకులు పల్లె శివశంకర్‌రెడ్డి, విభూదిరెడ్డి, పల్లె ప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, పల్లె ప్రసాద్ రెడ్డి, ఉశేనయ్య, చిన్న పుల్లారెడ్డి, పెద్దపుల్లారెడ్డి, ప్రశాంతం రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఇమాం హుసేన్, కిశోర్, చిన్నబాషా,సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం అవంతికారెడ్డి సమక్షంలో సందుల జిలానీ బాషా, ఇమాంహుసేన్, సుంగలి మహమ్మద్ హుసేన్, బాలమద్దిలేటి, ముస్కిన్‌సా గారి మావలి, సిరాబాయిగారి బాషా, ఇమాం హుసేన్ పార్టీలో చేరారు.

ఉపాధి పనులు ప్రారంభం



జీనేపల్లెలో పనులు చేస్తున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఉగాది పండుగ తర్వాత పనులు గ్రామ గ్రామాన మొదలయ్యాయి. ప్రస్తుతం పంట కాల్వల పనులు చేస్తున్నారు. ఎండ అధికంగా ఉండడంతో పనుల వేళలను అధికారులు మార్చారు. ఉదయం 6 నుంచి 10:30 గంటలకు వరకు పనులు చేసేలా చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలకు టెంట్ సదుపాయం కల్పించారు. రోజుకు రూ.251 వేతనం పడుతుంది. గ్రామాల వారిగా చూస్తే గోవిందపల్లెలో అత్యధికంగా 350 మంది, కామినేనిపల్లె 330, కామినేనిపల్లె 335,గంగవరం 300, బోయలకుంట్ల 301, చెన్నూరు 75, గుంప్రమాన్‌దిన్నె 67, గుండంపాడు 39, జీనేపల్లె 266, కోటపాడు 130, మహదేవపురం 180, మోత్కలపల్లె 102, శిరివెళ్లలో 140, వనికినిదిన్నె 42, వీరారెడ్డిపల్లె 70, వెంకటాపురం 185, యర్రగుంట్ల 52 మంది పనులకు వస్తున్నారు.

అభివృద్ధిని మరోసారి గెలిపించండి



30వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి నాగిని రవిసింగారెడ్డి

నంద్యాల(సిటీ): గత 5 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సతీమణి నాగిని రవిసింగారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డులో కౌన్సిలర్ పోలూరు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రామచంద్రుడుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు టీడీపీ చేసే దుష్ప్రచారాలను నమ్మొద్దని, మీ కళ్ల ముందు జరిగిన మంచిని గుర్తించి బాధ్యతగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న యాళ్లూరు వలంటీర్లు

గోస్పాడు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 84 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగఅనసూయకు రాజీనామా పత్రాలను అందజేశారు. గోస్పాడులో 18మంది, యాళ్లూరులో 32, కానాలపల్లెలో 10, ఎం.కృష్ణాపురంలో 10, జిల్లెలలో 14మంది చొప్పున రాజీనామాలు చేశారు. వారు మాట్లాడుతూ శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి గెలుపునకు శ్రమిస్తామని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో వినోద్, దీపా, పుల్లయ్య, నాగకృష్ణ, లక్ష్మి తదితరులున్నారు.

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు వార్డు వలంటీర్లు గురువారం రాజీనామా చేసి రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డికి అందజేశారు. 25 వ వార్డుకు చెందిన 10 మంది,18వ వార్డులో 14 మంది, 5వ వార్డు నుంచి 10 మంది, 31వ వార్డులో 19మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

శిల్పా కుటుంబం వెంటే ఉంటా



శిల్పా మోహన్‌రెడ్డిని కలిసిన సుదర్శనం

నంద్యాల(అర్బన్): తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన శిల్పా కుటుంబం వెంటే జీవిత కాలం ఉంటానని పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిందెల సుదర్శనం తెలిపారు. తాను పార్టీ మారినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. గురువారం ఎమ్మెల్యే శిల్పా రవి నివాసంలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికీ శిల్పా కుటుంబం వెంటే ఉంటానని, వచ్చే ఎన్నికల్లో రవిచంద్రకిశోర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ మా ఇంటికి వచ్చి మద్దతు కోరిన విషయం వాస్తవమేనని, అయితే తాను శిల్పా కుటుంబం వెంటనే ఉంటానని స్పష్టం చేశానని తెలిపానన్నారు.

కలిసికట్టుగా శ్రమిద్దాం..జగనన్నను సీఎం చేసుకుందాం



కాకరవాడలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఉయ్యాలవాడ : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా శ్రమించి.. మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కాకరవాడ, బోడెమ్మనూరు, మాయలూరు, అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో ఎంపీ పోచాతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని మరోసారి గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నూరు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రామమోహన్, ఉప సర్పంచ్ దండే పార్థసారథిరెడ్డి, నాయకులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కర్నాటి రామకృష్ణారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో టీడీపీకి షాక్



గంగుల ప్రభాకర్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, గంగుల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురంలో టీడీపీ భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తలారి చౌడయ్య రమణారెడ్డి, దొనపూడి దయానందరావు, వెంకటరామిరెడ్డి, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తనతో పాటు మాజీ సర్పంచ్ సాయమ్మ, మాజీ ఎంపీటీసీ నేతి బలరామ్, తలారి ప్రసాద్ తోపాటు మరో 75 కుటుంబాలకు జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, గంగుల సుదర్శన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే చాకరాజువేముల గ్రామానికి చెందిన భూమా శేఖర్‌రెడ్డి పార్టీలో చేరారు. 30 ఏళ్లుగా భూమా కుటుంబానికి ముఖ్య అనుచరుడుగా ఉన్న చౌడయ్య పార్టీ వీడటం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. ఆయనతో పాటు బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నచ్చి స్వచ్ఛందగా పార్టీలో చేరినట్లు వారు ప్రకటించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, శ్రీపతి ప్రసాద్, పాదం శీను, బత్తుల కృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, డీలర్ శివుడు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం



భక్తుల జయజయ ధ్వానాల మధ్య సాగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం

పగిడ్యాల: శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం పగిడ్యాలలో లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం భక్తజన సందోహం మధ్య రమణీయంగా సాగింది. స్థానిక ఊరవాకిలి నుంచి కుంటవీధి గండి వరకు సాగిన రథోత్సవ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రథానికి టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. రథాన్ని ముందుకు లాగే క్రమంలో వెనుక భాగంలో గొలుసులు పట్టుకుని ఉన్నా ఆచారి హఠాత్తుగా కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు పెద్ద ఎత్తున కేకలు వేయగా రథాన్ని నిలిపివేశారు. అయితే తనకు ఎలాంటి అపాయం కలుగలేదని స్లిప్ అయి కిందపడిపోయానని ఆచారి పేర్కొన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు. రథోత్సవం సందర్భంగా పగిడ్యాల భజన బృందం చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



మాట్లాడుతున్న డీపీఆర్‌సీ దస్తగిరి బాషా

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా పంచాయతీ రిసోర్స్ పర్సన్ దస్తగిరి బాషా మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి వచ్చే నిధులు నిర్వహణపై ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం, జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్, ఉపాధి హామీ, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు పంచాయతీలకు మంజూరవుతాయని వివరించారు. వీటి వ్యయంపై సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సచివాలయంలో వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించి అత్యవసర పనులకు ఖర్చు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.రిసోర్స్‌పర్సన్ శేషన్న, బాలాంజనేయులు, యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ఏకాంత సేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు గురువారం ఉదయం కల్యాణోత్సవం, రాత్రి ఏకాంత సేవ పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, కల్యాణోత్సవం చేశారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వర స్వామి దంపతులకు ఏకాంతసేవ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.